# నిరంతర ద్వయం

కులకాంత పుట్టింటికి వుడాయించిన చలికాలపు రాత్రుల్లో నాకు పుస్తక మొకటే శరణ్యం. ఆరోజు రాత్రి నా చేతికి దొరికిన పుస్తకం బుర్రను కాస్తా వేడెక్కించిందనే చెప్పాలి. రాత్రి పన్నెండు గంటలు దాటి వుంటుంది. అసలే చిన్న గది కావడం వల్ల లోపల గాలి కదలడం లేదు. లేచి వెళ్ళి కిటికీ తలుపు తీశాను. మంచు సోనల మసక వెన్నెల్లో లోకం ఒక నిశ్చల కాసారంలా వుంది. కొలనులో తామర మొగ్గల్లా వీధి దీపాలు మాత్రం వెలుగుతున్నాయి. చల్లగా ఒక గాలి కెరటం వచ్చి సోకేసరికి శిరోభారం గూడా తగ్గినట్టు తోచింది. గ్లాసెడు మంచినీళ్ళు తాగి పడుకుందామన్న ఆలోచనలో వుండగా; నాకు కనిపించిన విశేషం ఒకటి కొద్ది నిముషాల పాటు నన్నా కిటికీ దగ్గర అలాగే నిల్చోబెట్టింది.

నగరం శివార్లలో వున్న మారుమూల పేట మాది. చెరువు అంచు దగ్గర చివరి నీటి పాయలాంటిది. నగర గర్భంలో ఓ కారుషెడ్డు వేసుకోడానికయ్యే ఖర్చుతో యిక్కడొక పెంకుటిల్లు నిర్మించుకోడం సాధ్యమవుతుంది. అక్కడ అరుగుపైన పెట్టుకునే పెట్టె దుకాణానికి చెల్లించుకోవలసి వచ్చే అద్దె డబ్బులకు యిక్కడొక సుమారుపాటి ఇల్లు కాపురానికి దొరుకుతుంది. మార్కెట్టుకు, బజార్లకు, హోటళ్ళకు, సినిమాలకు ఎంత దూరంగా వుంటే అంత మంచిదన్నది మా చింతలపేట నివాసులకు ఒంటపట్టిన వేదాంతం. నగరం తన చేతులు సాచి యింతగా విస్తరించక పూర్వం యిదంతా సాగుకు లాయకీ గానీ పోరంబోకు బీడుగా పడివుండేదట. గడచిన పాతికేళ్ళ కాలంలో ఆ బీడు ఈ వాడగా మారింది. వంద పెంకుటిళ్ళు, అంతకు రెట్టింపు పూరి గుడిసెలు, తుమ్మ తోపులో మామిడి చెట్లల్లా అక్కడక్కడా కొన్ని గార మిద్దెలు, అత్యవసరంగా కావలసి వచ్చే వస్తువులను కొనుక్కునే సదుపాయం కోసం వీధికొకటి రెండు అంగళ్ళు. ఇంతమాత్రమే మా వాడ సౌభాగ్యం. ఈ చింతలపేట గూడా తమ సామ్రాజ్యంలో ఒక భాగమేనని నిరూపించటానికన్నట్లుగా పురపాలక సంఘం వారిక్కడ అయిదారు చేదబావులు తవ్వించారు. నీటి తర్వాత వాళ్ళకు నీడ చాలా ముఖ్యమైనదిగా తోచింది. పేటకు నడుమ ఒక గుట్టలా పడి వుండిన ప్రదేశాన్ని చదును చేసి, అక్కడొక పార్కును ఏర్పాటు చేశారు. పగటి పూట సోమరిపోతులకు విశ్రాంతి నిలయంగాను, పిల్లలకు క్రీడా వేదికగానూ ఉపకరించే ఆ పార్కు రాత్రుల్లో మాత్రం రైలు నిలవని స్టేషన్లా నిర్జనంగా వుండడమే మామూలు. కిటికీ తలుపు మూసి వెనక్కు రాదలచుకున్న క్షణంలో నాకా పార్కు తాలూకు పిట్టగోడ దాపున, కానుగ చెట్టు నీడ క్రింద పూల తెప్పలా తెల్లటివ కారు ఒకటి కనిపించింది. చింతలపేట చిల్డ్రన్ పార్క్ వద్ద ఒక కారు! కూరగాయల పాదులో క్రోటన్ మొక్కలా యిది విడ్డూరమే!

నా పరిజ్ఞానం అనుమతించినంతలో చింతలపేట వాసులకు కారు అనేది ఒక వస్తు విశేషం. రోడ్లపైన అది రంయిమంటూ దూసుకుపోతుందని మాత్రం వీళ్ళు ఎరుగుదురు. అంతకు మించి వీళ్ళకు దానితో గానీ, దానికి వీళ్ళతో గానీ పని కలిగి వుండదు. పూర్వ కాలంలో రాజులైన వారు ఎవరి కొంపనైనా గుండం చేయదలచుకున్నప్పుడు వారికొక ఏనుగును బహూకరించేవారట! గజరాజానికి మేత అందివ్వలేక వీడి పని అణగారిపోయేదట! అయితే మా చింతలపేట పౌరులు

వివేకవంతులు. 'బాబూ! నీకొక కారు' అంటూ ఒక వదాన్యశేఖరుడు యివ్వజూపినా 'బాబ్బాబూ! నీకొక నమస్కారం' అంటూ పారిపోగలరే కానీ, దాని దరిదాపులకైనా వెళ్ళరు. పోనీ యిక్కడున్న వారి బంధుసత్తముడికెవడికైనా కారుండకూడదా అన్న అనుమానానికి ఆస్కారం లేకపోలేదు. ఐయినా ఇంత దూరం కారుపైన వచ్చిన వ్యక్తి యిక్కడ కారు దిగి నడుచుకుంటూ వెళ్లి, ఈ రాత్రివేళ మకాం చేయదగిన యిల్లేదో నా ఊహ ప్రసరించినంతలో నాకు స్ఫురించలేదు. ఆయా కారణాల వల్ల నా పాలిటికా కారు అర్ధ రాత్రపు వింతలా, అర్థం కాని పజిల్లా, నా ఊహా శక్తిని అవహేళన చేసే గూఢ విషయంగానే దృగ్గోచరమైంది.

వెళ్ళి పడుకున్నాను. నిద్ర పట్టింది. ఉదయం నిద్ర లేవగానే నిత్యకృత్యాలు మొదలు. ఆఫీసు ఫైళ్ళ అలజడిలో తలమునిచిన తర్వాత మిగిలిన సర్వ విషయాలూ విస్మృతి పథంలో పడిపోతాయి. సాయంకాలం ఆఫీసు నుంచి రీడింగు రూముకు వెళ్ళి, అది కట్టేసిన తర్వాత హోటల్లో భోజనం చేసి, పనిలో పనిగా సినిమా గూడా చూచుకుని అర్ధరాత్రి తర్వాత గృహోన్ముఖుడినయ్యాను. పార్కు యింకొక వంద గజాల దూరంలో వుందనగా హఠాత్తుగా నాకు కారు సంగతి జ్ఞప్తికి వచ్చింది. తలపైకెత్తి ముందుకు చూద్దును గదా, అదే చోట, అదే కారు, అదే తీరులో కనిపించింది.

దగ్గరగా వెళ్తున్నకొద్దీ ఈ కారు రహస్యమేమిటో తేల్చి పారెయ్యాలన్న పూనిక నాలో బలపడసాగింది.

అద్దానికి వెనుక మినుకు మినుకు మని వెలుగుతున్న నిప్పురవ్వ ఒకటి, దాని వెనుక లీలగా ఒక మానవాకృతీ కనిపించాయి.

పలకరించడానికి ఒక మిష గూడా దొరికినట్లయింది.

జేబులోంచి సిగరెట్టు పెట్టె తీసి అందులో నుంచి సిగరెట్టు పైకి తీసేసరికి సరిగ్గా నేను కానుగ చెట్టు క్రింద వున్నాను. అక్కడ ముందుకు వేసిన కాలు వెనక్కు తీసుకుంటూ కారు లోపలికి తొంగి చూచి "అగ్గిపెట్టె వుంటే యిప్పిస్తారా?" అన్నాను.

కారు తలుపులు బిగించి వుండడం వల్ల అతడికి నా మాటలు వినిపించినట్టు లేదు. అయినా వాలకాన్ని బట్టి నా యింగితాన్ని గ్రహించినట్టుగా అతడు కిటికీ కడ్డంగా వున్న గాజు తలుపును క్రిందికి దించాడు. దృఢమైన హస్తం వెలుపలికి వచ్చింది. వ్రేళ్ల సందున అగ్గిపెట్టెతో సహా!

'థేంక్స్' చెప్పాను. 'నోమెన్షన్' అనైనా అనలేదు మహానుభావుడు.

ఇంతకూ ఇతడు కారు ఓనరా? కాక డ్రయివరా?

అయినా ఓనరూ, డ్రయివరూ - ఒకరే ఎందుకు కాకూడదు?

సిగరెట్టు వెలిగించుకున్నాను. ఇక అగ్గిపెట్టె వాపసు చేయడమే తరువాయి. ముహూర్తం మించిపోతోంది. ఆరా తీసే అవకాశం జారిపోయినట్టేనని మనసులోని కుతూహలం గోల పెడుతోంది.

సమయానికి దారం దొరకాలి. ఉచ్చు వెయ్యాలి. విసరాలి. విసరిన ఉచ్చు దేనికి తగులుకోవాలో దానికి తగులుకోవాలి. సంభాషణను కొనసాగించి, ఆంతర్యాన్ని వెలికి లాగడంలో యింత తతంగమూ వుంది. అది నిజంగా ఒక కళ! నాకు కళాస్వరూపమైతే తెలిసింది గానీ, కళాసాధనకు ఉపక్రమించే దారి ఏమిటో తెలిసింది కాదు.

అయితే నా ప్రయత్నానికి సుళువును చేకూరుస్తూ ఇక్కడొక తమాషా జరిగింది.

కిటికీకి చేరువగా జరిగి వచ్చి అగ్గిపెట్టె కోసం చేయి చాస్తూ అతడు "ఏమండీ! ఈ ప్రాంతంలో ఎక్కడైనా మెడికల్ షాపులున్నాయా?" అని ప్రశ్నించాడు.

"ఎందుకండీ! ఏం కావాలి మీకు?" అన్నాను.

"బుర్ర బద్దలైపోతూవుంది. పట్టుగర్రతో పెరికినట్టుగా నరాలు గుంజుతున్నాయి. తలను తీసుకెళ్ళి ఏ రైలు చక్రాల కింద వుంచేసినా బాగుండి పోవు ననిపిస్తోంది."

"ఎంతమాటెంత మాట!" అంటూ నొచ్చుకున్నాను. "చింతల పేటలో అసలు మందుల షాపులే లేవు. నగరంలోనైనా ఈ వేళప్పుడు మెడికల్ షాపులు తెరువబడి వుండడం అనుమానమే! అలాగని తలను తీసుకెళ్లి రైలు చక్రాలకప్పగించవలసిన పనేమీ లేదు."

మరేం చేయాలని ప్రశ్నిస్తున్నట్టు అతడు నిస్సహాయంగా నావైపు చూస్తున్నాడు.

"మా ఇల్లిక్కడికెంతో దూరంలో లేదు. నా గదిలో తలనొప్పికి రెండు మూడు రకాల మందులున్నాయి. ప్రస్తుతానికింట్లో నేను తప్పితే మరెవ్వరూ లేరు గూడా!"

గుదిగ్రుచ్చి చెప్పిన ఈ మూడు కారణాలు అతడిచేత నా ప్రతిపాదనను అంగీకరింప చేశాయి.

గదిలోకి వెళ్లేదాకా మా యిద్దరి మధ్య నెలకొన్నది మౌనమే. లైటు వేశాను. వాలు కుర్చీలో కూచోమన్నాను. అంజనం తెచ్చి యిచ్చి కణతలకు పట్టించమన్నాను. మాత్రలు మ్రింగాలంటే వేడి నీళ్ళుండాలి. అందుకని స్టౌ ముట్టించాను.

"చూశారా! నా మూలంగా మీకు లేనిపోని శ్రమ..."

క్షమాపణకు అడ్డు తగిలాను – "ఫరవాలేదు. మీరేం మొగమాటపడకండి! పుట్టుకతోనే మానవుడు సంఘం పైన ఆధారపడుతున్నాడు. కష్టనష్టాల్ని గానివ్వండి. సుఖ సంతోషాలను గానివ్వండి అతడు తోటి మనుషులతో కలిసి పంచుకోక తప్పదు. అంతెందుకు? మీరీ గదిలో అడుగుపెట్టి అయిదు నిమిషాలైనా కాలేదు. నేను మిమ్మల్ని గురించి ఆలోచించడం మొదలు పెట్టి ఈ క్షణానికి ఇరవై నాలుగు గంటలు దాటింది. బహుశా నాలాగే మీ పోలకువను గమనించిన వాళ్ళు మరికొందరు వుండనే వుంటారు. కిటికీలు బిడాయించుకుని ఒంటరిగా మీపాటుకు మీరు కారులో కూర్చుని అంతటితో ప్రపంచంతో సంబంధాలు తెగిపోయినట్టు భావించడముంది చూచారా. అది పంచాంగాన్ని చింపి పోగులు పెట్టి, ఇక నక్షత్రాలు లేవనుకోవడమే..."

ఇక లాభం లేదన్నట్టు అతడు అడ్డంగా తలాడిస్తూ 'అలాగా' అన్నాడు. ఆ తర్వాత దాదాపు స్వగతంలా తన భావాల్ని మాటల్లోకి అనువదించడానికి ప్రయత్నించాడు. "అయితే నేనింకొక ఆశ్రయం చూచుకోవలసిందే! చెబుతున్నాగా! రేపటి నుంచి ఈ ప్రాంతాల్లో కనిపించను..."

అందుకు దారితీసిన కారణాలేమిటో తేలకపోయినా, అతడి పరిస్థితి ఏమిటో నాకు బోధపడినట్టయింది. వ్యక్తి చువ్వలా, చలాకీగా వున్నాడు. విలువైన దుస్తులతో, నలిగిపోని క్రాఫింగుతో మట్టసమైన వేషం. కొనతేలిన ముక్కు, పెదవులు ముడిపడే తీరు, ఆలోచించినప్పుడల్లా కళ్ళు కుంచించుకు పోయే వైఖరీ, నుదుట తొంగి చూచే నొక్కులు, వీటితో కూడిన ముఖ భంగిమ అతడి పట్టుదలను సూచిస్తోంది. పిలవగానే నాగదికి రావడానికి సిద్ధపడడంతో అతడు తొందరగా నిర్ణయాలు తీసుకోగలడని అవగతమైంది.

మనిషి ప్రయోజకుడనీ, బాగా సంపాదిస్తున్నాడనీ అనుకోవడానికి సందేహం అక్కర్లేదు. ఈ వివరాలన్నీ ఉపోద్ఘాతంగా జమకట్టకోవచ్చు. ఇకపైన అసలు కథలోకి వెళ్ళడమే తరువాయి.

స్టౌ మీద నీళ్ళు కాగాయి. కాగిన నీళ్ళను గిన్నెలో నుంచి గ్లాసులోకి వంచుకున్నాను. నిస్సహాయ స్థితిలో వున్న అర్భకుడిలా అతడు నోరు తెరిచాడు. ఏకథమ్మున రెండు మాత్రలు మింగించేశాడు.

కుర్చీ తీసుకొచ్చి వాలు కుర్చీకి దగ్గరగా వేసుకుంటూ "రాత్రుల్లో మీరు ఇంటి దగ్గర పడుకోవటం లేదా?" అని అడిగాను.

నిండుగా గాలి పూరించిన రబ్బరు బెలూను పైన గుండు సూదిని దింపినట్టే అయింది. గుప్పెడు గుండెలో దాగి వుండిన వేదన తుఫానులా ప్రిదిలిపోయింది.

"పడుకోవాలనే అనుకుంటాను. పగలంతా నా ఉద్యోగంతోనే నాకు సరిపోతుంది. చీకటి పడగానే యింటికి వెళ్తాను. చెబితే మీరు నమ్మరు! పెళ్ళామన్న పేరుతో నాకొక ఆడమనిషి ఉంది. ఆవిడతో ఒకటి రెండు గంటలకన్నా ఎక్కువ సేపు సహజీవనం చేయడం సాధ్యం గాదు. ఇది అయిదేళ్ల అనుభవం మీదట తేలిన సంగతి..."

"అయ్యో పాపం!" అంటూ సానుభూతి ప్రకటించకుండా వుండలేకపోయాను.

"అయ్యో పాపమని ఒకసారి చెబితే చాలదు. ఈ దౌర్భాగ్యుడి కోసమని మీరు మీ సానుభూతిని పెద్ద అంకెతోనే గుణించాలి. ఎందుకు లెండి మేష్టారు గారూ! నా జీవితంలో ఘోరమైన పొరపాటు జరిగిపోయింది...."

ముఖాన్ని రెండు చేతులతోనూ కప్పుకుని అతడు భోరున ఏడ్చేస్తాడేమో ననిపించింది. అంతపనీ చేయకుండా అతడు ముఖాన్ని అవతలకు త్రిప్పుకున్నాడు.

"తలనొప్పి పోగొడతానని తీసుకొచ్చి మరింత ఎక్కువ చేసేటట్టున్నాను. మన్నించండి. ఇష్టం లేకపోతే చెప్పొద్దు" అన్నాను.

"కాదండీ మేష్టరు గారూ! ఎవరితోనైనా చెప్పుకోకపోతే నాకు రిలీఫ్ కలిగేటట్టు లేదు. నేనెవరినో మీరెరుగరు. మీరెవరో నాకు తెలియదు. అర్ధరాత్రి వేళ ఆపద్బాంధావుడిలా నాకు దొరికారు. నేనీ నగరంలో అడుగుపెట్టి పదేళ్ళు కావస్తున్నాయి. వ్యాపార సరళిలో మాత్రమే నేను పరిచయాలు పెంపొందించుకుంటూ వచ్చాను. నాగోడేమిటో వివరించి, పరిష్కారమేదైనా సూచించమనడానికి నాకొక ఆత్మీయుడైనా లేక..."

"పరిష్కారం చెప్పగలనని కాదు, మీకభ్యంతరం లేకపోతే చెప్పండి. శ్రద్ధగా వినగలను. నాకూ తెలుసుకోవలనే వుంది" అన్నాను.

"ఇక్కడికి అరవై మైళ్ళ దూరంలో ఏనుగు మల్లమ్మ కొండ కటువైపున మామిళ్లపాడనే వూరుంది. అదే మావూరు. నేనీ పట్టణానికొచ్చినప్పటికి మా అమ్మ సజీవంగానే వుండేది. పుణ్యాత్మురాలు! నేనిక్కడ నా నిరవాకాన్ని వెలిగించక మునుపే కళ్ళు మూసింది. మాది సమిష్టి కాపురం. పెత్తనం మా మేనమామ గారిది. మా నాన్నగారు పోగానే వున్న నేలా నట్రా తెగనమ్ముకుని మా అమ్మను చాకిరీ మనిషి కింద లెక్కకట్టుకున్నాడు. ఎటొచ్చీ నేను చదువుకోవడమూ, నాకు చదువు రావడమూ కూడా మా మావయ్యే పాలిటికి మ్రింగరాని ముద్దలుగా వుండిపోయాయి. నాలుగు మైళ్ళ దూరం గుట్టలకడ్డం పడి వెళ్ళి నేనొక పూరి పాకల హైస్కూల్‌లో చదువుకునేవాణ్ణి. హైస్కూలు చదువు వల్ల నాకు సర్టిఫికేటు అయితే దొరికింది కానీ లోకజ్ఞానం మాత్రం అబ్బలేదు. ఆ చదువు ముగిసినప్పటి నుంచీ

మళ్ళీ అయిదారేళ్ల దాకా నా మేనమామ గారి పొలాలపైన పెద్ద పాలేరుగా మాత్రమే వ్యవహరించాను. 'మందుడు', 'జడుడు', అని మనం పద్యాల్లో చదువుకుంటాం గదండీ! అప్పట్లో ఆ బిరుదులన్నీ నాకు అనువర్తించేవే! అదృష్టమనుకోండి, దురదృష్టమనుకోండి. నాకక్కడినుంచి పారిపోయి అంతకంటే మెరు గ్గా బ్రతికే అవకాశాల కోసం అన్వేషించాలన్న బుద్ధి పుట్టింది. పోయినవి పోగా ఆనాటికింకా మా అమ్మ దగ్గర మిగిలివున్న ఒకే నగ మూడు తులాల బంగారు గొలుసు. ఆ గొలుసును జేబులో వేసుకుని దేశంపైన పడ్డాను. నేనెక్కిన బస్సు నన్ను తీసుకొచ్చి ఈ పట్నంలో దిగవిడిచింది...."

గ్లాసులో మిగిలివున్న నీళ్ళను ఒక గుక్కలో ఖాళీ చేసి, అతడు మళ్ళీ ప్రారంభించాడు.

"గొలుసునమ్మగా వచ్చిన నాలుగు వందల రూపాయలు ఎన్నాళ్ళకని సరిపోతాయి? పొట్ట గడవడం కోసం నేనేదైనా పని చేయవలసి వచ్చింది. మనిషి ఎంతటి దిక్కుమాలిన వాడుగానైతే వుంటాడో, అంతగా అతణ్ణి నికృష్ట పరిస్థితుల వూబిలో నొక్కి పెట్టాలనుకుంటుంది లోకం. ఓ మండీలో నాకు డెబ్బై అయిదు రూపాయల కొలువు దొరికింది. కడుపు నిండా తినాలనుకుంటే ఆ మొత్తం రెండు పూటల భోజనానికైనా చాలదు. అందుకని కుంపటిపైన స్వయం పాకం చేసుకోడానికి వీలుగా ఎక్కడైనా ఓ అద్దె గది దొరుకుతుందేమోనని వెదుకుతున్నాను. వెంకట్రామయ్య గారని ఓ రిటయిర్డు శిరస్తాదారు. బ్రతుకులో అతగాడివన్నీ కమిట్‌మెంట్సే! పరిష్కారం కోసం ప్రయత్నించిన పాపాన పోలేదు మహానుభావుడు. కుప్పలుకుప్పలుగా అప్పు చేశాడు. పిత్రార్జితమైన యింటిని గూడా తాకట్టు క్రింద పెట్టేశాడు. ఇంటి నిండుకూ అమ్మాయిల్ని కన్నాడు. నాగజముడు పొదలకు మల్లే సమస్యల్ని పెంచుకుంటూ కూచోడమే అతని పని. ఎరగకపోయి నేనతని యింట్లో వీధి వైపున వున్న గదిలో అద్దెకు దిగాను. ఇందాకా నేను "పెళ్లామన్న పేరుతో ఓ ఆడమనిషి' అన్నాను గదండీ! ఆవిడ ఆ దశలోనే నాకు తారసిల్లింది. ఎవరో గాదు. సదరు రిటయిర్డు శిరస్తాదారు గారి పెద్ద కూతురు....'.

శిరోభారం తగ్గిందీ లేనిదీ ఋజువు చేసుకోడానికన్నట్లుగా అతడు మెడకీలుపైన తలను అటూ యిటూ తిప్పి చూసుకున్నాడు. "తలనొప్పి తగ్గింది. మీరు పర్మిషన్ యిస్తే సిగరెట్టు కాల్చుకుంటాను" అన్నాడు. ఒకసారి పొగపీల్చి వదిలేసరికి ఆ ముఖంలో ఉ త్తేజం కాస్తా చోటు చేసుకుంది.

"చిన్నప్పటి నుంచి నేను పుస్తకాల పురుగును లెండి! ముఖ్యంగా 'ప్రేమ' అనే పిచ్చి భావం ఆ వయసులో నా హృదయానికి గిలిగింతలు పెడుతూ వుండాలి. ప్రేమ గుడ్డిది. అంటే మనమొక వ్యక్తిని ప్రేమించగలమంతే గానీ, అలా ప్రేమించడానికి కారణాలేమిటో చెప్పమంటే చెప్పలేమన్న మాట! ప్రేమకంటే అపురూపమైనది, అమూల్యమైనదీ, ధ్రువమైనదీ మరొకటి లేదు. ప్రేమకోసం అవసరమైతే సర్వ ప్రపంచాన్నీ ధిక్కరించాలి. ఇంకా మాట్లాడితే ప్రేమకోసం ప్రాణత్యాగం చేసినా తప్పులేదు. ఇలా ప్రేమ పిచ్చిలో పడి కొట్టుకుపోతుండగా నా చేతికేదో దొరికింది. బిగ్గరగా కౌగలించుకున్నాను. తీరా అంత పని చేశాక తెలిసింది..."

"ఏమని?"

"అది ఈతమొద్దని..."

ఈ చివరి మాట నాపైన హెచ్చరికలా పని చేసింది. కథకుడూ, కథానాయకుడూ ఒక్కడే అయినప్పుడూ శ్రోత జాగ్రత్తగా మసలుకోవాలి. లేకుంటే కథలోని ఒకానొక పాత్రపైన అతనికి గల కినుక శ్రోత పైకి మళ్లే ప్రమాదం వుంటుంది. అందుకని మరింత జాగరూకుణ్ణిగా వుండటానికిక ప్రయత్నిస్తూ "ఉండండుండండి. మీరు మొదట్లోనే

చెప్పవలసిన విషయం ఒకటి బాకీ వుండిపోయింది. మీ పేరేమిటో చెప్పారు కాదు" అన్నాను.

"నా పేరు సత్యనారాయణ. సన్నిహితులు 'సత్యం' అని పిలుస్తారు. స్వోతిశయమనుకోకపోతే చెబుతాను. నాది సార్థక నామధేయమనేనని నేననుకుంటాను. జీవితానికి సంబంధించిన ఎంతో సున్నితమైన విషయాలను గురించి గూడా నేనెంత నిష్కర్షగా మాట్లాడగలనో మీరు గమనించే వుంటారు. మాది సముద్రమంత డిపార్టుమెంటు. పైపెచ్చు మా భీమా కంపెనీ వాళ్ళ వ్యవహారాలన్నీ జనంతోనే. నన్నెరిగిన వాళ్ళకందరికీ నా మాటపైన, నీతిపైన తిరుగులేని నమ్మకముందని చెప్పుకోవడానికి నేను గర్విస్తాను. మామూలు ఏజంటుగా నేను డిపార్ట్‌మెంట్‌లో ప్రవేశించాను. ఇప్పుడు నా నెలసరి ఆదాయం వెయ్యి రూపాయలు. జీవితం ఒక పొగరుబట్టిన గుర్రం లాగానే నాకెదురైంది. కళ్లెం బిగపట్టి నేను దాన్ని నా అదుపులోకి తెచ్చుకోగలిగాను. కానీ ఏం లాభం? రచ్చలో గెలిచాను. ఇంట్లో చిత్తు చిత్తుగా ఓడిపోయాను..."

"ఎక్కడ ప్రారంభించినా మీరొక చోటకి వచ్చి ఆగిపోతున్నారు" అన్నాను నేను. కథ ఎట్లాగైనా ముందుకు సాగాలన్నది నా ఉద్దేశం.

"ఏం చేయమంటారండీ మేష్టరు గారూ! సముద్రంలో నుంచి పైకి లేచే పెద్ద రాయి ఒకటి వుంటుందనుకోండి. బయల్దేరిన ప్రతి అలా దానికి మోదుకుని తిరిగి వెళ్లిపోతుంది. నా బ్రతుకులోనూ జరుగుతున్నదదే! అది నా జీవిత ప్రవాహానికెదురైన పెద్ద కొండపేటు. ఆశలకు హద్దు. ఆశయాలకు ఫుల్‌స్టాపు. నా ఉరవడికి ఆనకట్ట. అక్కడ నా తలను దానికేసి మోదుకోవాలని మాత్రమే అనిపిస్తుంది. మరింత స్పష్టంగా చెప్పేస్తున్నాను మీకు! ఒక ఆడదానికి భర్తగా వుండడానికి బొత్తిగా పనికిరాని మగవాడు, ఆ మగవాడికి భార్యగా వుండడానికి సుతరామూ పనికిరాని ఆడది – భూమండలం పైన యిలాంటి జంట ఒకటి వుంటుందనడానికి తార్కాణం మా కాపురమే ననుకోండి! అంతెందుకు! మీరు నా వయసెంతుంటుందని అనుకుంటున్నారు?"

"ఎంతో ఎక్కడ! ముప్పై వుండొచ్చునేమో..."

"ఆవిడ వయసు ముప్పై అయిదు. ఎంత లేదన్నా నాకన్నా అయిదేళ్ళు పెద్దది..."

"అరరే పాపం!" నొచ్చుకున్నాను.

"అంతటితో ఏమయింది? తానేమో శాఖాహారి. నాకా చప్పిడి తిండి సయించదు. నాలుక కాస్త పదునెక్కాలంటే నా పాలిటికి హెూటళ్ళే శరణ్యం. ఒక్క ఆహారంలోనే కాదు. ఆచారాల్లో గానీ, అభిరుచుల్లో కానీ పొంతన లేదంటే నమ్మండి. దేవుడనే పెద్ద మనిషిని స్వయానా పక్కింటి వాడుగా భావించడం నాకుగిట్టదు. ఆ మాట చెబితే నన్ను నాస్తికుడని ఎద్దేవా చేస్తుంది. నేను సినిమా అంటే తాను పేరంటం అంటుంది. కాసేపు డాబాపైన పడుకుందామంటే వల్లగాదు – గదిలో పరుపు వేసేశానంటుంది. మాటమాటకు తెగులే! మాటిమాటికీ రగడే! నువ్వు చెప్పడమేమిటి, నేను వినడమేమిటి అన్న ధీమా చాలా వుంది లెండి! అప్పటికి తనేమో పెద్ద ఆఫీసరైనట్టు. తన గృహ సామ్రాజ్యంలో నేనొక అల్ప ప్రాణినైనట్టు వ్యవహరిస్తే ఎలా భరించడమో చెప్పండి!" ఏడుపు మొగం పెట్టి అతడు బిక్క చూపులు చూడసాగాడు.

నాలో పుక్రోశం పెల్లుబికింది. మానవ జాతిలో వున్నదల్లా ఆడా, మగా అంటూ ప్రముఖ వర్గాలు రెండే! నాదైన మగజాతికి యింకొక వర్గం ద్వారా జరిగే ప్రతి అపకారాన్నీ,

అన్యాయాన్నీ నా సర్వశక్తులూ వినియోగించి ఎదుర్కోవాలన్న పట్టుదల బాహాటంగా చేతల రూపంలో కాకపోయినా ఆంతరంగికంగా ఆలోచనల రూపంలో నాలో పుష్కలంగా వుండనే వుంది. అందువల్ల పై వర్గ సంఘర్షణలో ఘోరంగా ఓడిపోయిన నా తోడి సోదరుడికి కాస్తో ఉత్సాహాన్ని అందించి, ఒక్కింత బలాన్ని నూరిపోసి మళ్ళీ ఒకసారి అతన్ని పోరాటానికి ఆయత్తం చేయడం నాకు అవశ్యకర్తవ్యమనిపించింది.

"చాదస్తం కాకపోతే ఏమిటండీ మీరు? మగమహారాజులు మీరు? మీకు బేలతనం పనికిరాదు. ఇలాంటి గడ్డు సమస్యకున్న పరిష్కారం ఒక్కటే! మీకు తెలియందేమీ కాదు..."

ఎగరవేసిన బంతిని అంది పుచ్చుకున్నట్టుగా అతడు నా మాటకు అడ్డు తగిలాడు - "విడాకులే గదండీ! ఇచ్చేశాను. ఆ ముచ్చట కూడా ముగిసింది. మేమిప్పుడు చట్టరీత్యా భార్యభర్తలం కూడా కాదు..."

ఈసారి నేను తెల్లబోవడం మాత్రమే జరిగింది. తేరుకోవడం జరుగలేదు.

"ఈ నేరానికి గాను నాకు కోర్టువారు విధించిన నెలసరి జుల్మానా రెండు వందలా యాభై రూపాయలు..." అతడింక మీదట ఏడవడమే తరువాయి.

జుల్మానా అంటే ఏమిటో నాకర్థమైంది. కానీ ఒకవైపున జీవనాంశం చెల్లిస్తూ యింకొక వైపున ఆవిడగారినింకా స్వగృహంలోనే ఉంచుకోవలసిన అవసరం ఏమై ఉ ంటుంది? ఈ 'మిస్టరీ' ఏమిటో నాకణుమాత్రమైనా అంతు పట్టడం లేదు..

ఎలాగైనా ఈ సత్యనారాయణ అనే వ్యక్తి కుశాగ్ర బుద్ధి మాత్రం గాకపోలేదు. అతడు నా యింగితాన్ని చప్పున గ్రహించాడు. "అసలేం జరిగిందంటే మేష్టరు గారూ..." అంటూ ఉపక్రమించి నా సందేహానికి సమాధానం చెప్పుకపోసాగాడు. "రెండేళ్ల పాటు బుద్ధిగానే భరణం చెల్లిస్తూ వచ్చాను. ఇంతలో ఈ కారు గొడవొకటి వచ్చి పడింది. ఎలాగైనా సరే, ఏనాటికైనా స్వంత కారు పైన తిరగాలన్నది నా జీవితాశయం. అయిదేళ్ళ పాటు నెల ఒకటికి రెండు వందల యాభై చొప్పున చెల్లించుకుంటే ఈ కారు నాకు స్వంతమై పోతుంది. భోజనానికి, ఇంటద్దెకు, పై ఖర్చులకు నా సంపాదనలో మూడు పాతికల ముప్పాతిక వంతు సరిపోతుంది. మిగిలిన పాతిక వంతు ఆదాయాన్ని కారుపైకి మళ్ళించడం తప్పనిసరై పోయింది. అందుకని బువ్వకోసమని అవ్వను తెచ్చుకున్నట్టుగా మళ్ళీ తనొచ్చి యింట్లోనే వుండిపొమ్మన్నాను. విడాకులు కోరింది తాను కాదు గదా! భేషుగ్గా వుంటానని తరలి వచ్చేసింది. ఫలితమేమిటంటే మాష్టరు గారూ! ఇప్పుడు నా జీవితమనే నాణానికి బొమ్మా, బొరుసుగూడా అమిరినట్టయింది. బొమ్మేమో కారు. బొరుసేమో పోరు. కారు కోసం సహజీవనం. పోరు పడలేక మళ్ళీ కారులోనే పలాయనం!"

దాదాపుగా తెల్లవారుజాము కావచ్చింది. నేరాన్ని ఒప్పుకున్న తర్వాత కటకటాల్లోకి వెళ్ళడానికి ఉద్యుక్తుడవుతున్న నేరస్తుడిలా అతడు పైకి లేచాడు. సాగనంపడం కోసం వీధి గుమ్మందాకా వెళ్లాను. మెట్లు దిగి వీధిలో అడుగు పెట్టి అతడు చీకట్లోకి మంచులోకి జారుకోగా, నేను తిరిగి వెళ్ళి నా గదిలో ప్రవేశించిన తర్వాత స్ఫురించింది - నేనతడి చిరునామా అడిగి తెలుసుకోలేదని!

ఒక మనిషిని గురించిన జ్ఞాపకాలు యింకొక మనిషిని అంత సులభంగా వదలిపెట్టవు. చలికాలపు రాత్రుల్లో కిటికీ తలుపులు తెరిచినప్పుడు, రోడ్డుపైన తెల్లటి కారు కన్పించినప్పుడు, భార్యాభర్తల మధ్య పొసగని కాపురాలను గురించి విన్నప్పుడు సత్యనారాయణ మెరపులా జ్ఞప్తికొస్తుండేవాడు.

పల్లెలు పేటలుగా, పేటలు పట్టణాలుగా, పట్టణాలు మహా నగరాలుగా మారడం మానవ నాగరికతా పరిణామంలో చాలా ముఖ్యమైన విషయమే అయినప్పటికీ, అందువల్ల మనిషికి మనిషికీ మధ్య సంబంధాలు పలచబడిపోయే ప్రమాదం మట్టుకూ లేకపోలేదు. మహా నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో నివసిస్తున్న ఇద్దరు మిత్రుల్ని బెటీ చేసి, ఒకరి కోసం ఒకరు వెదుక్కుంటూ వెళ్ళినప్పుడు తప్పితే, మరెప్పుడైనా వాళ్ళు యాదృచ్ఛికంగా రోడ్డుపైన కలుసుకున్న సందర్భముందేమో అడిగి చూడండి! అలా, ఎప్పుడూ జరగలేదన్న ప్రత్యుత్తరం వస్తే ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు.

కాలమనే సముద్రంలో సంవత్సరాలు బిందువులు. నాలుగైదేళ్ళు గడచిపోయాయన్న మాటకేంగానీ, సత్యనారాయణ కోసం నేను సల్పుతున్న అన్వేషణ ఫలించింది. అయితే ఈసారి అతడు కనిపించడం అర్ధరాత్రి గడచిన తర్వాత మాత్రం కాదు. అర్ధరాత్రికి బాగా ముందుగా ఎనిమిదికీ తొమ్మిదింటికీ మధ్య బ్రహ్మాండమైన ఒక ఎగ్జిబిషన్‌లో కాళ్ళరిగిపోయేటట్టు తిరిగి తిరిగి, కాళ్ళీడ్చుకుంటూ బస్‌స్టాపు వైపు నడుస్తున్నాను. పేవ్‌మెంటు పక్కన వరసగా ఆగివున్న కార్లలో ఓ తెల్లటి కారు కనిపించింది. లోకంలో తెల్లకార్లకేం కొదవ? కనిపించింది సత్యనారాయణ కారు కావడమన్నది వెయ్యి పర్యాయాల కొక్కసారి సంభవమైతే కావచ్చు. కాకనూ పోవచ్చు. కారును దాటుకుని ఈవలికి రాబోతుండగా స్టీరింగు చక్రం వెనుక సీటుకు చేరగిలబడి, సిగరెట్టు కాల్చుకుంటున్న ఓ వ్యక్తి కన్పించాడు. అదే భంగిమ! అదే సిగరెట్టు కాల్చే తీరు! చూచిన మరుక్షణంలోనే అతన్ని పోల్చుకోగలిగాను.

కారులోకి తొంగి చూస్తూ "సత్యనారాయణగారే కదండీ! నమస్కారం" అన్నాను.

అతడు కారు తలుపు తెరుచుకుని పేవ్‌మెంట్ పైకి వచ్చేశాడు. నా ముఖంలోకి పరిశీలనగా చూస్తూ "మీరు....మీరు..." అంటూ కొద్ది క్షణాల పాటు నీళ్ళు నమిలాడు. నిప్పులాంటి జ్ఞాపకాలపైన ఏవేవో ప్రాపంచిక విషయాలు నివురులా పేరుకపోవటం కద్దు. ఒకటీ రెండు నిమిషాల పునశ్చరణతో నివురు ఎగిరిపోయి అతడి జ్ఞాపకం నిప్పులా మెరిసిపోసాగింది.

"మన్నించండి మేష్టారు గారూ! చాలా కాలమైంది గదూ! కాసేపు పట్టింది పోల్చుకోడానికి. కులాసాయే గదండీ! ఆ గదిలోనే వున్నారా?" అతడు పరామర్శ ప్రారంభించాడు.

నిరాఘాటంగా సాగిపోతున్న అతడి ప్రసంగానికి వెనుక, నా బుర్రలో రైళ్ళుపరుగెడుతున్నాయి. నగరం శివార్లలోని ప్రశాంత ప్రదేశాలు మునపటి కతడి రాత్రి మజిలీలుగా వుండేవి. అలాంటి చోట్లల్లో ఉనికి సందేహాలకు దారితీస్తుందని, యిప్పుడా పద్ధతి మార్చుకున్నాడేమో! జనసమ్మర్దంతో నిండిన ప్రదేశాల్లో ఎంతసేపు కారాపుకున్నా అడిగేవాళ్ళుండరు. రణగొణ ధ్వనికి అలవాటు పడితే నిద్ర పోగలగడం కూడా అసాధ్యమేమీ కాదు. అతడిప్పుడు నిమగ్నుడై వున్న సాధన అదేనేమో!

"ఇంతకూ అంతకూ నాకు తలనొప్పి వచ్చేస్తుందంటే నమ్మండి మేష్టరు గారూ! ఇందాకా ఎగ్జిబిషన్‌లో తిరుగుతూ వుండగా జివ్వుజివ్వుమంటూ ఒంటి చెంప తలనొప్పి ప్రారంభమైంది. రెస్ట్ తీసుకుంటే అదే పోతుందని చక్కా యిలా వచ్చేశాను. ఈ మధ్య ఒక డాక్టరు గారి దగ్గరకు వెళ్తే ఆయన కళ్ళజోడు పెట్టుకోమన్నాడు. తీసుకొచ్చి యింట్లో పెట్టానంతే! దాన్ని మా యింట్లో వున్న సిసింద్రీ ఎక్కడ వుండనిస్తాడు? అదిగో, మాటల్లోనే వచ్చేశాడు..."

"ఎలాగైనా మంచి బుద్ధిమంతుడే! అక్కడున్న వినోదాలన్నీ వీడి పాలిటికి కొరగాకుండా పోయాయి. 'నాన్నారి దగ్గరికి, నాన్నారి దగ్గరికి' అంటూ ఒకటే గొడవ!.. వెళ్ళరా బాబూ!"

తల్లి దగ్గరి నుంచి అదొక హేలగా ఆ బిడ్డ తండ్రి భుజం మీదికి దాటుకున్నాడు.

బిడ్డకోసం ఎగ్జిబిషన్లో కొన్న ఓ విమానం బొమ్మను పైకి తీశాడు సత్యనారాయణ. "బాబూ, కాసేపు దీనితో ఆడుకో నాన్నా! నేనిదిగో, ఈ మామయ్యతో గూడా వెళ్ళి ఓ 'టీ' తాగి యిప్పుడే వచ్చేస్తాను...బుద్ధిగా ఆడుకుంటావు గదూ?" అంటూ బిడ్డను కారులో తల్లికి ప్రక్కనే సీటుపైన కూర్చోబెట్టాడు.

"తొరగా ఒచ్చేయాలి" హెచ్చరిస్తున్నాడు కుర్రాడు.

స్టాల్లో కూర్చున్న అయిదు నిమిషాలకు వేడి వేడిగా తేనీటిని చప్పరిస్తూ "కారుపైన కంతులన్నీ చెల్లించేశారా?" అని అడిగాను.

"ఓ చెల్లించేశానే! అప్పు తీరి ఆరు మాసాలైంది. కానీ విపరీతమేమిటంటే, కారు పూర్తిగా స్వంతమైపోయేటప్పటికీ, దీనిపై వుండిన మోజు కూడా తీరిపోయింది. బేరం వస్తే ఒకటి రెండు వేలు తగ్గింపు ధరకైనా అమ్మేయాలనుకుంటున్నాను. ఎంతకాలమని అద్దె యిళ్ళల్లో వుండగలం చెప్పండి! ప్లాటు కొనిపెట్టి చాలా కాలమైంది. ముచ్చటగా ఓ చిన్న యిల్లు కట్టుకోవాలనుకుంటున్నాను. ఏనాటికైనా మనిషి ఓ యింటివాడు కావాలి కదండీ! ఏమంటారు?"

మిగిలివున్న కాస్తా తల నొప్పి చెల్లాచెదురైపోయేటట్టు సత్యనారాయణ గలగలా నవ్వసాగాడు.

● ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక 1975 ●